క్లుప్తంగా

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న అబ్రహాం

ఏలూరు (టూటౌన్): క్రైస్తవులపై దాడులను అరికట్టాలని రిటైర్డ్ ఉపాధ్యాయుడు దోమతోటి అబ్రహాం డిమాండ్ చేశారు. ఇండియన్ క్రిస్టియన్ దినోత్సవం సందర్భంగా స్థానిక నరసింహారావుపేటలోని ఎస్సీఆర్‌పీఎస్, ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. భారత దేశ నిర్మాణంలో క్రైస్తవుల ప్రాతినిధ్యం, భాగస్వామ్యం అద్భుతమైందన్నారు. కేజీ బాలకృష్ణ కమిషన్ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని న్యాయం చేయాలని కోరారు. దళిత క్రైస్తవుల సామాజిక జీవితంలో పెనుమార్పులు వచ్చేటట్లు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. క్రైస్తవం అంటేనే ప్రేమ, సేవ అని గుర్తుచేశారు. కుల మతాలను పక్కన బెట్టి దేశ అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేయాల్సి ఉందని వివరించారు. ఒకరిపై ఒకరు దాడులు చేయడం, కించపర్చడం, నష్టపర్చడం వంటి చర్యలు హేయమైనవని పేర్కొన్నారు. సమావేశంలో మెండెం సంతోష్ కుమార్, బిగ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు కె.శాంతి సాగర్, నూకపెయ్యి కార్తీక్, తెనాలి సురేష్ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

దెందులూరు: పేదల సేవ దేవుని సేవతో సమానమని సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజనల్ కమాండర్ డి.ఏసురాజ్యం లత అన్నారు. గురువారం సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ హెడ్‌క్వార్స్‌లో కెప్టెన్ నేల రత్నకుమార్, సుకన్యరాయ్ ఆధ్వర్యంలో దాతలు భారతీ నవమణిరాజు ఇచ్చిన దుప్పట్లను పేదలకు అందజేశారు.

మహిళలకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు వివిధ అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ ఎం ఫణికిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీ సోమవారం నుంచి 18 నుండి 45 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళలకు ఉచితంగా మగ్గం వర్క్‌పై 31 రోజులు, జూట్ బ్యాగ్స్ (జనపనార సంచులు) తయారీపై 14 రోజులు శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 99485 65256, 95330 79471, 95027 23561లో సంప్రదించవచ్చని తెలిపారు.

అధికారుల నిర్ణయం.. విద్యార్థులకు సంకటం

- ఉర్దూ విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో..
- ఉర్దూ రాని విద్యార్థులకు ఉర్దూలో బోధన
- ఏలూరు నగరంలో ఉర్దూ పాఠశాలల్లో దుస్థితి
- ఉపాధ్యాయుల బదిలీల్లో పొరపాటుతోనే సమస్య
- విద్యార్థులు, తల్లిదండ్రుల గగ్గోలు


మౌలానా అబుల్ కలాం ఆజాద్ నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాల


తూర్పువీధి ముస్లిం బాలుర నగరపాలక ఉన్నత పాఠశాల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఏలూరు నగరంలోని ఒక పాఠశాలలో ఉర్దూ మాత్రమే అర్థం చేసుకోగల విద్యార్థులకు ఉర్దూ మీడియంలో బోధంచలేని ఉపాధ్యాయులను, మరో పాఠశాలలో ఉర్దూ మీడియం అర్థం చేసుకోలేని విద్యార్థులకు ఉర్దూ మీడియంలో మాత్రమే బోధించగల ఉపాధ్యాయులను నియమించడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. నగరంలో రెండు ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఒకటి పూర్తిగా ముస్లిం జనాభా నివసించే ప్రాంతంలో ఉంది. మరొకటి హిందువులు, క్రైస్తవులు నివసంచే ప్రాంతంలో ఉంది. ముస్లింలు నివసించే ప్రాంతంలోని పాఠశాలలో 95 శాతం మంది విద్యార్థులు ముస్లింల పిల్లలే. మరో ఉర్దూ పాఠశాలలో 82 మంది విద్యార్థుల్లో 15 మంది మాత్రమే ముస్లింల పిల్లలు ఉన్నారు. వీరిలో ఆరేడు మంది నూర్‌బాష (దూదేకుల) ముస్లింల పిల్లలు. ఇటీవల విద్యాశాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల సిపార్సుల మేరకు ఈ రెండు పాఠశాలల్లో ఉపాధ్యాయులను బదిలీ చేశారు. దీని వెనుక లోగుట్టు జిల్లా విద్యాశాఖాధికారులకే తెలియాలని విద్యార్థుల తల్లదండ్రులు వాపోతున్నారు.

ఉర్దూ విద్యార్థులపై ఒత్తిడి

నగరంలోని పెన్షన్‌లైన్‌లో ఉన్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు సుమారు 155 మంది ఉన్నారు. వీరంతా చిన్నప్పటి నుంచి ఉర్దూ మీడియం చదువుతున్నారు. బదిలీల్లో కొత్తగా వచ్చిన ముస్లిం ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టులను ఇంగ్లీష్ మీడియంలో బోధిస్తుంటే విద్యార్థులకు అర్థం కావడం లేదు. దీంతో ఉపాధ్యాయులు ఉర్దూ మీడియం చదివినా ఇంటర్మీడియట్‌లో ఉర్దూ కళాశాలలు దొరకవని, ఉర్దూలోనే చెప్పాలని ఒత్తిడి చేస్తే పరీక్షలు ముగిశాక టీసీలు ఇవ్వబోమని బెదిరింపులకు దిగి తమతో లేఖలు రాయించుకున్నారని విద్యార్థులు వాపోతున్నారు. తమకు ఉర్దూ మీడియంలోనే బోధించాలని వారు ఉపాధ్యాయులను కోరుతున్నారు.

ఉర్దూలో బోధన.. విద్యార్థుల వేదన

వెన్నవల్లిపేటలోని తూర్పువీధి ముస్లిం బాయిస్ స్కూల్ ఇటీవల ఉన్నత పాఠశాలగా వర్గోన్నతి పొందింది. ఇక్కడ ఎక్కువ మంది హిందూ, క్రైస్తవుల పిల్లలు చదువుతున్నారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న పిల్లలు 82 మంది ఉన్నారు. వీరిలో 15 మంది మాత్రమే ముస్లింల పిల్లలు. వీరిలోని ఆరేడు గురు నూర్‌బాష ముస్లింల పిల్లలు. ఈ స్కూల్లో ముస్లింల పిల్లలు తక్కువగా ఉన్నారని ఇటీవల ఎంఈఓ, డీఐలు జిల్లా విద్యాశాఖాధికారికి నివేదిక ఇచ్చారు. అయినప్పటికీ ఇటీవల జరిగిన బదిలీల్లో ఉర్దూ మీడియంలో బోధించే ఉపాధ్యాయులను బదిలీ చేశారు. వీరు ఉర్దూ మీడియంలోనే సబ్జెక్టులను బోధిస్తుంటే విద్యార్థులకు అర్థం కావడం లేదు. ఇంగ్లిష్ మీడియంలోనే బోధించాలని ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సంతకం కోసం బలవంతం



నేను చిన్నప్పటి నుంచి ఉర్దూ మీడియంలోనే చదివాను. ఇప్పుడు పదో తరగతిలోకి వచ్చాను. టీచర్లు ఉర్దూలో పాఠాలు చెప్పడంలేదు. వారు చెప్పేది అర్థం కావడం లేదు. మా తల్లిదండ్రులకు విషయం చెబితే స్కూల్‌కు వచ్చి అడిగితే ఇకపై ఇంగ్లిష్ మీడియంలోనే చదవాలని చెప్పారట. నాకు ఇంగ్లీష్ మీడియంలోనే చెప్పాలని నేను కోరుతున్నట్టు లేఖ రాయాలని బలవంతం చేస్తున్నారు.

– షేక్ బాజీ, 10వ తరగతి విద్యార్థి, ఎంఏకే స్కూల్, పెన్షన్‌లైన్

అర్థం కాలేదంటే అట్టతో కొట్టారు



ఒక టీచరు చెప్పిన పాఠం అర్థం కాక మరోసారి చెప్పాలని అడిగాను. దీంతో టీచర్ కోపంగా నాపై అట్ట విసిరేశారు. కాలుకి గాయం కూడా అయ్యింది. 8వ తరగతి చదువుతున్న సమీర్ అనే విద్యార్థిని టీచర్ గూబపై కొట్టారని చెప్పాడు. మమ్మల్ని శిక్షించి దారికి తెచ్చుకోవాలని చూస్తున్నారు. మాకు ఉర్దూలో చెప్పే టీచర్లే కావాలి. లేకపోతే మేము చదవలేం. చదువు మానేయాల్సిన పరిస్థితి వస్తుంది.

– షేక్ ఇద్రిస్, 9వ తరగతి విద్యార్థి, ఎంఏకే స్కూల్, పెన్షన్‌లైన్

నాగేశ్వరరావును పరామర్శించిన జేపీ


నాగేశ్వరరావును పరామర్శిస్తున్న జేపీ

ఏలూరు టౌన్: అనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గం ఎస్టీ విభాగం అధ్యక్షుడు దేవరకొండ నాగేశ్వరరావును పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, యు వజన విభాగం రాష్ట్ర కార్యదర్శి దాలి వెంకటేష్, జి ల్లా యూత్ కార్యదర్శి బండ్లమూడి సునీల్‌కుమార్, రామకృష్ణ, సత్యనారాయణ, బసవ ఉన్నారు.

6న కుక్కలకు రేబీస్ టీకాలు

ఏలూరు (టూటౌన్): ప్రపంచ అంటు వ్యాధుల దినోత్సవం (జునోసిస్ డే) సందర్భంగా ఈనెల 6న ఆదివారం కుక్కలకు రేబీస్ టీకాలు ఉచితంగా వేయనున్నట్టు పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు పి.సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం వెనుక ఉన్న పశుసంవర్ధక శాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న పశువైద్యశాలలో రేబీస్ టీకాలు వేస్తామని, ఏలూరు నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోని పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకాలు వేయించాల్సిందిగా కోరారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

ఏలూరు (టూటౌన్): కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఇఫ్టూ ఏలూరు నగర కమిటీ సమావేశం గురువారం ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు హాజరై మాట్లాడుతూ ఈనెల 9న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చినారు. నాయకులు గడసాల రాంబాబు, మీసాల వెంకటరమణ, సందకం అప్పారావు, పల్లి గంగరాజు, కాకర్ల శ్రీని, నవుడు నెహ్రూ బాబు, ఎస్ నాయుడు, తిరుపతిరావు, కోసూరి నూకరాజు, పిన్నింటి త్రినాథ్, కోరాడ అప్పారావు, పప్పు మహేష్, ఏసురత్నం, మజ్జి శ్రీను, సూరిబాబు, నాయుడు, భూపతి, నారాయణ, బోను లక్ష్మణరావు, పాతాళము అప్పారావు, సతీష్, సుబ్రహ్మణ్యం, నాగు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు దళితులంటే చులకన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చంద్రబాబు దళితులను చులకన చేస్తూ, వారి పట్ల అహంకారంతో మాట్లాడారని ఏపీ లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగయ్య ప్రమాదానికి గురయ్యాడని తెలియగానే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు హాస్పటల్‌కు తరలించాలని ప్రయత్నిస్తే, పోలీసులు వారిని వారించి అంబులెన్స్ పిలిచామంటూ అరగంట సేపు జాప్యం చేయడం వల్లే ఆయన పరిస్థితి విషమించి మృతి చెందారని పేర్కొన్నారు. ఆయన భార్య లూర్దుమేరి కూటమి ప్రభుత్వ కుట్రలను బయటపెట్టిందని, పేద దళిత కుటుంబంలో వ్యక్తి మరణిస్తే ఈ ప్రభుత్వం దానిని సానుభూతితో చూడాల్సింది పోయి, రాజకీయంగా వాడుకోవాలని చూసిందని ఆరోపించారు. తన భర్త మరణంపై ఆమె స్వయంగా జగన్‌ను కలిసి తన బాధను, అనుమానాలను చెప్పుకున్నారని, దీంతో చంద్రబాబు, లోకేష్‌లు ఖంగుతిన్నారని వివరించారు. ఒక చర్మకారుడిని రెండు గంటల పాటు తన కారులో తిప్పానని చంద్రబాబు గొప్పలు చెప్పుకున్నారని, ఇది జరిగి 48 గంటలు దాటకముందే దళితులు అంటే కుక్కలతో సమానమంటూ మాట్లాడారని తెలిపారు. గతంలోనూ దళితుల్లో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అని చంద్రబాబు మాట్లాడారని, ఆయన ప్రభుత్వంలోని మంత్రులు దళితులు శుభ్రంగా ఉండరు అంటూ హేళన చేశారని, ఇలాంటి నైజం ఉన్న చంద్రబాబు దళితులను ఎలా గౌరవిస్తారని ఆక్షేపించారు. ఇప్పటికైనా చంద్రబాబు దళితులను కనీసం మనుషులుగా అయినా చూడాలని, దళితుల శవాలతో రాజకీయాలు చేయడం మానుకోవాలని హెచ్చరిస్తున్నామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని వివిధ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతులు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెన్నవల్లివారిపేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, లంబాడి పేట, బావిశెట్టివారిపేట, నల్లదిబ్బ, కెనాల్ రోడ్ పరిసర ప్రాంతాలు, హనుమాన్ నగర్, ఎన్‌టీఆర్ కాలనీ, గ్రీన్ సిటీ, పెదపాడు రోడ్, శివ నగర్, సాయి నగర్, గణేశ్ కాలనీ, కొత్తూరు ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అమీనాపేట, అశోక్ నగర్, అమీనాపేట ఏటిగట్టు, అటవీ శాఖాధికారి కార్యాలయ ప్రాంతం, కేపీడీటీ స్కూల్ ప్రాంతం, గంగానమ్మ గుడి, వరాలమ్మ గుడి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. రామకృష్ణాపురం ఫీడర్ పరిధిలో గులాబీ తోట, రామకృష్ణాపురం, పోస్టల్ కాలనీ, విజయ గార్డెన్స్, నెహ్రూ కాలనీ, మినీ బైపాస్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తోమా సువార్త పరిచర్య క్రైస్తవ చరిత్రకు పునాది


పెరికె వరప్రసాదరావు

ఏలూరు (టూటౌన్): తోమా సువార్త పరిచర్య భారతీయ క్రైస్తవ చరిత్రకు పునాది వేసిందని జాతీయ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు తెలిపారు. భారతీయ క్రైస్తవ దినోత్సవం సందర్భంగా స్థానిక ఇజ్రాయేల్ పేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రైస్తవ్యం క్రీ.శ.52వ సంవత్సరంలో ఇజ్రాయేల్ నుంచి భారతదేశానికి వచ్చిందని తెలిపారు. క్రైస్తవ్యం ప్రాచీనమైనదే కానీ పాశ్చాత్యమైనది కాదని అన్నారు. క్రీ.శ.52వ సంవత్సరంలో ఏసు క్రీస్తు 12 మంది శిష్యుల్లో ఒకరైన తోమా కేరళ రాష్ట్రంలోని మలబార్ తీరానికి వచ్చి అక్కడ సువార్త చేసి సంఘాల్ని స్థాపించారని గుర్తుచేశారు. క్రీ.శ.72లో తమిళనాడులోని చెన్నై సమీపంలోని మైలాపూర్ సెయింట్ థామస్ మౌంట్ వద్ద క్రీస్తు సువార్త నిమిత్తం తోమా హత సాక్షి అయ్యాడని తెలిపారు. నాటి నుంచి తోమా బలిదానాన్ని జ్ఞాపకం చేసుకుంటూ జూలై 3న సెయింట్ థామస్ డేగా ప్రకటించారని వివరించారు.

వన్ స్టాప్ సెంటర్ తనిఖీ


వన్ స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న శైలజ

ఏలూరు (టూటౌన్): బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా కృషి చేస్తామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ అన్నారు. ఆమె గురువారం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న వన్ స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ప్రతి జిల్లాలో ఏర్పాటుచేసిన ప్రిమారిటల్ కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. తదుపరి టీడీపీ కల్యాణ మండపం వద్ద ఉన్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను సందర్శించారు. బాధిత మహిళల సహాయం కోసం ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్‌లో మెరుగైన సేవలు అందించాలని అధికారును కోరారు. మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.సుజాత, నోడల్ అధికారి స్వరాజ్య లక్ష్మి, సీడీపీఓ రాజశేఖర్ ఉన్నారు.

స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలి


ఎమ్మెల్యే చంటికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగం ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ గురువారం ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటి, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబుకు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రాలను అందజేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి కనీస వేతనం రూ.26 వేలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ సిబ్బందికి ఆరు డీఏ బకాయలిలు చెల్లించాలని, లీవ్ బకాయిలను ఎన్‌క్యాష్‌మెంట్‌లను చెల్లించాలని కోరారు. రెండు నెలలకు పైబడి ఆందోళలను చేస్తున్నామని, ఏటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా వినతిపత్రాలు అందజేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, కోశాధికారి బి.నారాయణరావు, సహాయ కార్యదర్శి ఎస్‌ఎంవీ సుబ్బారావు, యూనియన్ కార్యకర్తలు కె.శ్రీనివాసరావు సీహెచ్ అప్పారావు, జి.రవి, కె.బాలకిషోర్ పాల్గొన్నారు.

టీచర్ చంద్రశేఖర్ మృతికి సంతాపం


టీచర్ చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శించిన సమన్వయకర్త జేపీ

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ నాయకులు నేతల కోటి సోదరుడు ఉపాధ్యాయుడైన చంద్రశేఖర్ ఆజాద్ రైలు ప్రమాదంలో మృతిచెందారు. గురువారం రాత్రి ఆయన మృతికి వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. జేపీ వెంట పార్టీ నాయకులు గుడిదేశి శ్రీనివాసరావు, నెరుసు చిరంజీవి, దాలి వెంకటేష్, బండ్లమూడి సునీల్‌కుమార్, చుక్క సత్యనారాయణ, స్థానిక నాయకులు ఉన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన తప్పనిసరి

భీమడోలు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఏలూరు సబ్ యూనిట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. పూళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.అరుణజ్యోతి ఆధ్వర్యంలో గురువారం డెంగీ వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకొని పీహెచ్‌సీ పరిధిలోని కురెళ్లగూడెం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి వైద్య ఆరోగ్య బృందం దోమ కాటు వలన కలిగే అనర్థాలపై వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జె.గోవిందరావు మాట్లాడుతూ దోమలు వలన ప్రాణాంతక వ్యాధులు సోకుతాయన్నారు. ప్రతి శుక్రవారం పొడి వాతావరణం కలిగి ఉండాలని, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని సూచించారు.

వంట బిల్లులు, జీతాలు విడుదల చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్నం భోజన కార్మికుల వంట బిల్లులు, జీతాలు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్‌కు ఏఐటీయూసీ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలల వంట బిల్లులు, జీతాలు విడుదల చేయాలని, ప్రతినెలా బిల్లులు విడుదల చేయకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులపై ఎస్‌ఎంసీ కమిటీల ఒత్తిడి ఉండకూడదని, పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు, వంట బిల్లులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్ళకట్ల త్యాగరాజు, కంకిపాడు బుచ్చిబాబు, చాట్ల పుల్లారావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా ట్రెజరర్ కుప్పాల కన్నబాబు, నాయకులు పి.కిషోర్, తదితరులున్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న పండు

దెందులూరు: మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ సూచనతో కొమరేపల్లిలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పెన్సిళ్లు గురువారం పంపిణీ చేశామని మాల మహాసేన రాష్ట్ర నాయకులు, వైఎస్సార్ సీపీ నేత గంటా పండు తెలిపారు. గురువారం ఏలూరులో కోటగిరి శ్రీధర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశానని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి రావాలి

భీమడోలు: దెందులూరు నియోజకవర్గ పరిధిలోని పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి క్యాంపు కార్యాలయం వద్ద ఈ నెల 4వ తేదీ శుక్రవారం ఏలూరు జిల్లా, దెందులూరు నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని, భీమడోలు మండల పార్టీ అధ్యక్షుడు రావిపాటి సత్య శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు కోరారు. జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అనే నినాదంతో చేపట్టనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఉభయగోదావరి జిల్లాల పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, పీఏసీ సభ్యుడు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతారన్నారు.

సమావేశానికి కొండలరావుపాలెం రావాలి

ఉంగుటూరు: వైసిపి పార్టీ విస్తృతస్థాయి సమావేశం నేడు ఏలూరు నుంచి దెందులూరు నియోజకవర్గం కొండల రావుపాలెంకు మార్చడం జరిగిందని వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు మరడమంగరావు తెలిపారు. పార్టీ కార్యకర్తలు నాయకులు కొండలరావు పాలెం చేరుకోవాలని ఆయన సూచించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	38	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	66
వంకాయలు (కాంతులు)	38	బీళ్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	36
బెండకాయలు	36	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	40	కంద	--
కాకర కాయలు	40-46	బీట్‌రూట్	38
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	96
క్యాబేజీ	26	అల్లం	60
క్యారెట్	45	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	37
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	22
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	25
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	29
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు – తిరుపతి	16.00	4830	29